## కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి

ఎదులాపురం, జూన్ 14 : ఆదిలాబాద్‌లోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన పనులు కూల్చివేయడంపై మాజీ మంత్రి జోగురామన్న అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు ఏ ప్రాతిపదికన కూలుస్తున్నారో తెలియజేయాలని కోరారు. ఇక్కడ పట్టణ అధ్యక్షుడు అజయ్, అశోక్ స్వామి, హైమద్, పందిరి భూమన్న, ప్రకాశ్, దమ్మపాల్, గణేశ్, మోబిన్, సాయిప్రణయ్, మోసిన్‌ఖాన్, వసంత్, మహేశ్ ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

నార్నూర్, జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో మూడు రోజుల క్రితం పిడుగుపాటుకు మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి పరామర్శించారు. శనివారం పిప్రి గ్రామాన్ని సందర్శించారు. ఝరి దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మాడవి మాన్కు, బీఆర్ఎస్ నార్నూర్ మండలాధ్యక్షుడు హన్మంత్‌రావు, సర్పంచ్‌ల సంఘం నార్నూర్ మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్ ఉన్నారు.

## ఏజెన్సీ దళిత భూ సంరక్ష సమితి డివిజన్ కమిటీ

నార్నూర్, జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మలేపూర్ గ్రామంలో మాతాంగ్ ఋషి సంస్కార వ్యవస్థాపకుడు సూర్యవంశీ పండరి అధ్యక్షతన ఏజెన్సీ దళిత భూ సంరక్ష సమితి డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా గేడం నిరంజన్, ఉపాధ్యక్షులుగా మానే సంతోష్, మేటే సదాశివ్, ప్రధాన కార్యదర్శిగా నరహరికాంబే, కోశాధికారిగా సూర్యవంశీ పండరి, కో చీఫ్ అధ్యక్షుడిగా దుర్గే కాంతారావు, కమిటీ సభ్యులు విద్వన్, హన్మంత్‌రావ్, రాష్ట్రపాల్, శేషారావ్, జైపాల్‌ను ఎన్నుకున్నారు.

## పాఠశాలకు విరాళం

భైంసా, జూన్, 14 : నిర్మల్ జిల్లా భైంసాలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రజోత్ కుమార్ రూ. 50 వేలు విరాళాన్ని శనివారం పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పురస్తు గోపాల్, శివ కుమార్ బచ్చువార్, తోట రాము, పెండెపు కాశీనాథ్, సురేశ్, రాజేశ్వర్, దత్తురాం పటేల్, పెరుగు నవీన్, శంకర్, సుదర్శన్, గంగాధర్ పాల్గొన్నారు.

# రైతు నేస్తంకు ఏర్పాట్లు చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 14 : రైతు నేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ఈనెల 16న కొత్తగా 32 రైతు వేదికలను పర్చువల్‌గా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న తెలిపారు. రైతు నేస్తం, పీఎం జన్ మన్ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ సదస్సులపై సంబంధిత అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17 కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించి, ఈనెల 16 నుంచి అదనంగా మరో 32 కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ప్రతి రైతునేస్తం కేంద్రంలో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారితోపాటు మండల స్థాయి అధికారులైన ఎంపీడీవో, ఎంపీవో వ్యవసాయ అధికారులను నియమించడం జరిగిందని, నూతనంగా ఏర్పాటు చేసిన 32 రైతు వేదికలను ముస్తాబు చేసి పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఇంటర్నెట్ కనెక్షన్‌తోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆయన సూచించారు. జిల్లాలో మొత్తం 49 రైతు వేదికలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లాలో పీఎం జన్మన్, జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ సదస్సులు ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. పీఎం జన్ మన్, జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ సదస్సులు, ఈనెల 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో 150 గ్రామాలు ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సుల ద్వారా గిరిజనులకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, నివాసం, విద్యుత్, మంచి నీరు, రోడ్లు తదితర రంగాల్లో అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువ రాజ్, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.



41వ సారి రక్తదానం చేసిన ల్యాబ్ టెక్నీషియన్ అల్లూరి సతీశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

### రక్తదానానికి ముందుకు రావాలి

'రక్తం యంత్రం ద్వారా తయారు కాదని, మానవ శరీరానిదే అందువల్ల ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి' అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ రిమ్స్ ఆడిటోరియంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రక్తదానం చేసిన స్వచ్ఛంద సభ్యులు, సామాజిక వేత్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. స్వచ్ఛంద సంఘాల నాయకులు కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజల్లో అపోహలు తొలగి, అవగాహన పెరుగుతుందని తెలిపారు. రక్త నిల్వలు ఉండడం అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే మార్గం అని అన్నారు. ఆదిలాబాద్‌లోనే క్యాంపులు కొనసాగుతున్నాయని, ఉట్నూర్, బోథ్ క్యాంపులు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ రిమ్స్ మొదటి స్థానంలో ఉన్నదని వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### బాధితులకు నాణ్యమైన వైద్యం అందించండి

పిడుగుపాటుకు గురై ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం రిమ్స్‌కు వెళ్లి బాధతులను ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలంటే ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎమర్జెన్సీ వార్డులోని మరుగుదొడ్లను పరిశీలించారు. శుభ్రత పాటించక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు రోగులను పరీక్షించే సమయంలో ఎవరెవరు డ్యూటీలో ఉన్నారనే విషయం తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి వస్తున్నారా లేదా అని అక్కడ ఉన్న సిబ్బందిని అడిగారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కేషీట్లను పరిశీలించి వైద్యుల హాజరు వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, సిబ్బంది ఉన్నారు.

## చౌడేశ్వరి మాత ఆలయం చోరీ

ఎదులాపురం, జూన్ 14 : ఆదిలాబాద్ శివారులోని ప్రసిద్ధ చౌడేశ్వరి మాత ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం, గేట్లకు వేసిన తాళాలను దొంగలు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలోని వస్తువులు చిందరవందర చేశారు. శనివారం ఉదయం ఆలయ సిబ్బంది అక్కడికి రాగా తాళం పగలగొట్టి ఉండడం, సామాన్లు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం పరిసరాలు తనిఖీ చేసి ఆధారాలు సేకరించారు. ఒక ముక్కు పుడుక కనిపించడం లేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

## వ్యవసాయ బావిలో పడి చుక్కల దుప్పి మృతి

దస్తురాబాద్, జూన్ 14 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామ శివారులో ఊర కుక్కలు తరమడంతో వ్యవసాయ బావిలో చుక్కల దుప్పి పడింది. అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. కొద్ది నిమిషాలకు చుక్కల దుప్పి మృతి చెందింది. పశు వైద్యాధికారి సంధ్య అక్కడే పంచానామా నిర్వహించారు. అనంతరం మృతి చెందిన చుక్కల దుప్పిని దహన సంస్కారాలు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఎఫ్ఎస్‌వో కింగ్ ఫిషర్, ఎఫ్‌బీవో నుమాన్, వెటర్నరీ డాక్టర్ సంధ్య, అసిస్టెంట్ దేవీదాస్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

## సూరిటీ చెక్ లోన్ తిరిగి ఇవ్వని వ్యక్తులు రిమాండ్

ఇచ్చోడ, జూన్ 14: అధిక డబ్బుల కోసం సూరిటీ చెక్ లోన్ తిరిగి ఇవ్వకుండా దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలానికి చెందిన జ్ఞానేశ్వర్ పంపట్టి రమేశ్ వద్ద రాజు అనే వ్యక్తికి సంబంధించిన రూ.5 లక్షల షూరిటీ కింద బాండ్ పేపర్ ఇచ్చారు. రూ.5 లక్షలు ముట్టినప్పటికీ ఇంకా డబ్బులు రావాలని దౌర్జన్యానికి పాల్పడి తన సూరిటీ చెక్, బాండ్ తిరి ఇవ్వాలని కోరగా పంపట్టి సురేశ్, పంపట్టి సుభాష్ ఇవ్వకపోవడంతో వారిపై ఈనెల 13న ఫిర్యాదు చేశారు. శనివారం పంపట్టి సురేశ్, పంపట్టి సుభాష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

## చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు

ఇచ్చోడ, జూన్ 14: చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియా అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వాడకం పెరిగిపోయిన సందర్భంగా యువకులు మంచిమార్గంలో కాకుండా చెడుమార్గంలో పయనిస్తున్నారన్నారు. చైల్డ్ పోర్న్ వీడియోలను ఇతరులకు పంపిస్తూ పైశాచిక ఆనందంలో మునిగి తేలుతున్నట్టు యువత సక్రమమైన మార్గంలో పయనించాలన్నారు. జిల్లాలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై సైబర్ క్రైమ్ ద్వారా నిందితులను గుర్తించి, వారిపై తగిన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. 13వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఒక వ్యక్తి నిందితుడు ఠాకూర్ సూర్యసింగ్ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో కుమారి గ్రామానికి చెందిన పోతగంటి రాకేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని తెలిపారు. ఇతను పిల్లలపై జరుగు అత్యాచార వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కారణంగా అతనిపై హైదరాబాద్ చైల్డ్ టిప్ లైన్ వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

# అసంపూర్తి బ్రిడ్జి.. పంట నష్టం

- నష్టపోయిన రైతుల ఆవేదన
- బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి



నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతులు

బేల, జూన్ 14: గత నాలుగు నుంచి ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సిర్సన్న గ్రామ రైతుల పంటపై ప్రభావం చూపుతున్నాయి. అంతరాష్ట్ర రహదారి 353బీ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగడంతో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అనేక పంట పొలాలు చెరువులను తలపించేలా మునిగిపోయాయి. ముఖ్యంగా ఇటీవల విత్తనాలు వేసిన 20 ఎకరాల పంట నీటిలో మునిగి నష్టపోయింది. రైతులు పేర్కొంటూ, సోయా విత్తనాలతో నిండిన 20 సంచులు పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయాయని ఆందోళన చెందారు. ఈ సందర్భంగా సిర్సన్న గ్రామ రైతులు విలేకరులతో మాట్లాడుతూ, బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడంతో తమకు ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్రైన్ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో వరద పొలాల్లోకి ప్రవేశించి మట్టిపాలైపోయినట్లు చెప్పారు. పంట నష్టం మాత్రమే కాక, నీరు చేరడం మూలంగా పొలాల్లో ఉన్న బోరుబావులు కూలిపోవచ్చనే భయంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయాలని, ఇప్పటి వరకు జరిగిన నష్టానికి పరిహారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా తమకు కొత్త విత్తనాలు సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.

# బాలుడిని సంరక్షించిన జిల్లా అధికారులు

- రైల్వే స్టేషన్‌లో తల్లి వదిలేసిన వైనం

ఎదులాపురం, జూన్ 14 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఏడుస్తూ కనిపించిన బాలుడిని జిల్లా బాలల సంరక్షణ అధికారులు రక్షణలోకి తీసుకున్నారు. ఈ నెల 13వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్‌లో ఏడుస్తున్న బాలుడిని గమనించిన రైల్వే ఔట్‌పోస్టు పోలీసులు చైల్డ్ లైన్‌కు సమాచారం అందించారు. శుక్రవారం అర్ధరాత్రి వెంటనే స్పందించిన చైల్డ్ లైన్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని బాలుడిని హక్కున చేర్చుకున్నారు. శనివారం బాలల సంరక్షణ అధికారి, సిబ్బంది, రైల్వే పోలీసులు, షూర్ ఎన్జీవో కోర్డినేటర్ కే వినోద్‌తో కలిసి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌ను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. డీసీపీవో రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..బాలుడు పేరు రాహుత్ గణేశ్ (7) తల్లి పూజ, తండ్రి రావుత్ రాజు అని పేర్కొన్నాడు, బాలుడు మహారాష్ట్రలోని అకోలా ప్రాంతానికి చెందినవాడిగా చెబుతున్నాడు. తల్లి తనను స్టేషన్‌లో కూర్చోబెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లినప్పటి నుంచి తిరిగి రాలేదని బాలుడు తెలిపాడు. ఈ విషయంపై మహారాష్ట్ర అకోలా పోలీసులు, అక్కడి బాలల సంరక్షణ అధికారులతో స్థానిక అధికారులు సంప్రదించారని సమాచారం. బాలుడి తలిదండ్రులు లేదా సంరక్షకుల వివరాలు సేకరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి బాలుడు జిల్లా బాలల సంరక్షణ అధికారుల పర్యవేక్షణలో ఉన్నాడని తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసినవారు పీవోఐసీ ఎన్ స్వామి 9493433400, పీవోఎన్ఐసీ ఆర్ వినోద్ కుమార్ 9440289825 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. ఇక్కడ పీవోఐసీ ఎన్ స్వామి, పీవోఎన్ఐసీ ఆర్ వినోద్ కుమార్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, రైల్వే పోలీసులు ఉన్నారు.



రైల్వే స్టేషన్‌లో బాలుడితో కలిసి తనిఖీ చేస్తున్న అధికారులు

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 14: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన మార్గలను అనుసరిస్తూ అమాయక ప్రజలను మోసగించడం కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తతో ఉండి డేటా, డబ్బును రక్షించుకోవాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. సైబర్ క్రైమ్ బాధితులు డబ్బును పోగొట్టుకున్న ఎడల గోల్డెన్ హవర్ అనగా ఒక గంటలోపు సంప్రదించినట్లయితే బ్యాంకు లావాదేవీలను నిలిపివేసి డబ్బు తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. సోషల్ మీడియాలో వేధింపులకు ఏపీకే ఫైల్స్, మొబైల్ హ్యాకింగ్, ఆన్‌లైన్ గేమ్ మోసాలు, బిజినెస్, ఇన్వెస్ట్‌మెంట్, స్టాక్ మార్కెట్, క్రెడిట్ కార్డు, లోన్ ఫ్రాడ్లపై జాగ్రత్తగా ఉండాని సూచించారు. జిల్లాలో గత వారం రోజుల్లో ఐదు సైబర్ నేర ఫిర్యాదులు నమోదు కాగా, వాటిలో కొన్ని ముఖ్యమైన కేసులు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన మహిళకు క్రెడిట్ కార్డు ద్వారా అకౌంట్ నుంచి ఆమెకు తెలియకుండానే రూ.15,460 పోగొట్టుకుంది. బాధితురాలు సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఉట్నూర్‌కు చెందిన మెస్రం అశోక్ ఆన్‌లైన్ టాస్కుల పేరిట అధిక ఆదాయానికి ఆశచూపి మోసపోయాడు. ఈ మేరకు ఆయన కూడా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదిలాబాద్‌కు చెందిన సీహెచ్ శివకుమార్ అనే వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా సంప్రదించిన ఓ నేరగాడు అధిక లాభాల ఆశ చూపి దాదాపు రూ.5 లక్షలు తీసుకొని మోసం చేశాడు. సైబర్ నేరాల నివారణకు ప్రజల అవగాహన కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రైతులు జాగ్రత్తలు పాటించాలని

బేల, జూన్ 14: వర్షాకాలంలో పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో పిడుగు పాటుకు గురై ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయిన ఘటన దురదృష్టకరమని వారు విచారం వ్యక్తం చేశారు. శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వ్యక్తిగత స్థాయిలోనూ అండగా నిలుస్తామని పేర్కొన్నారు. వారి వెంట బీజేపీ మండలాధ్యక్షుడు వట్టిపెల్లి ఇంద్ర శేఖర్, నాయకులు ఉన్నారు.

## జొన్నల డబ్బులు అందించాలి

బోథ్, జూన్ 1 4: రైతులు జొన్నలు విక్రయించి నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని సీపీఐ నాయకుడు బీ గోవర్ధన్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వానకాల సీజన్ ప్రారంభమైందని రైతుల వద్ద డబ్బులు లేక ఇబ్బందులకు పడుతున్నారన్నారు. విత్తనాలు కొనే సమయంలో చేతికి డబ్బు అందక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతు భరోసా రాక, అమ్మిన జొన్నల డబ్బులు అందక రైతులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జొన్నల డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎల్ నరేశ్, కార్తీక్, మున్సిఫ్, పీ సంతోష్ పాల్గొన్నారు.

## పశు వైద్యాధికారిని నియమించాలి

బోథ్, జూన్ 14: ఆదిలాబాద్ జిల్లా సొనాలలోని పశు వైద్యాశాలలో పశు వైద్యాధికారిని వెంటనే నియమించాలని పశు పోషకులు కోరుతున్నారు. సంవత్సర కాలంగా పశు వైద్యాధికారి లేక సిబ్బందే విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం వైద్యాధికారుల నియామకాలు జరిగిన సొనాలకు రెగ్యులర్ వైద్యుడిని నియమించలేదన్నారు. సొనాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో 500 వరకు ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువైద్యాధికారిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కొనసాగుతున్న రిలే దీక్షలు

భైంసా, జూన్, 14 : బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ముథోల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాళ్ల బోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని పునః ప్రతిష్టించాలని కోరారు. వీరికి బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు దేవీదాస్ హస్డే, పలువురు మద్దతు తెలిపారు.



దీక్షలో కూర్చున్న నాయకులు

## ఉచిత వైద్య పరీక్షలు

దస్తురాబాద్, జూన్ 14 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్లో వైద్యారోగ్య శాఖ, ఎన్జీవో ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపును నిర్వహించారు. 41 మందికి హెచ్ఐవీ, గనేరియా, బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసినట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లలిత, సంతోష్, మల్లేశ్, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్ రెడ్డి, విజయలలిత, జ్యోతి, సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి

సారంగాపూర్, జూన్ 14: నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 21, 22వ తేదీలో నిర్వహించే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి రాజన్న పిలుపునిచ్చారు. శనివారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అలూర్ ఎక్స్‌రోడ్డు వద్ద గల బీడీ ఫ్యాక్టరీ ఎదుట సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాస్, రమేశ్, గంగాధర్, మనోహర్, జల్బా, రాజు, సత్యం పాల్గొన్నారు.

బోథ్, జూన్ 14: సొనాలలోని బీడీ ఫ్యాక్టరీ ఎదుట టీయూసీఐ రాష్ట్ర మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర కార్యదర్శి రాజన్న విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు శివాజీ, చిన్నయ్య, పోతన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

## పద్యకవి వెంకట్‌కు విశిష్ట సేవా కీర్తి పురస్కారం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 14 : నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృతోపన్యాసకుడు డాక్టర్ బీ వెంకట్ రాష్ట్ర విశిష్ట సేవా కీర్తి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ, కళామారుతి వేదికలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2025 ముగింపు సభలో ఆయన పురస్కారం అందుకున్నారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ శర్మ, ప్రధాన కార్యదర్శి సుప్రియగుప్తా, ప్రముఖ కవులు చొదూరి కళాపీఠం అధ్యక్షుడు చొదూరి నర్సింహారావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సాహిత్య సామాజిక సాంస్కృతిక కళా ఆధ్యాత్మిక విశిష్ట సేవలకు గుర్తింపుగా పురస్కారము స్వీకరించారు. ఆపరేషన్ సిందూర్ అనే అంశంపై వచిన కవిత, పద్యాలను గానం చేశారు.

## నీట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

తలమడుగు, జూన్ 14: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన సల్ల సంతోష్-గౌరమ్మ దంపతుల కుమార్తె సల్ల రుచిత శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో 561 మార్కులతో రాష్ట్రస్థాయి ప్రతిభ కనబర్చింది. నీట్ ఆల్ ఆలిండియా 8090వ ర్యాంకు సాధించి వైద్య సీటుకు ఎంపికైంది. ప్రతిభ కనబర్చిన సల్ల రుచితను గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

## ఎమ్మెల్యే కృషితో హైమాస్ట్ లైట్లు

తాంసి(సిరికొండ), జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలంలోని గోన, ధనోర గ్రామాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషితో హైమాస్ట లైట్లు మంజూరయ్యాయి. వాటిని శనివారం రాత్రి స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాదర్, అజయ్ యాదవ్, నాయకులు జహూర్ అహ్మద్, మతీన్, మహేందర్ పాల్గొన్నారు.

# రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి



నగదు పత్రాన్ని బాధితుడికి అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి



విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తల అభినందిస్తున్న కలెక్టర్, జడ్జి

ఎదులాపురం, జూన్ 14 : రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే కోర్టు చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో బీమా, యాక్సిడెంట్‌తోపాటు రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు రాజీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. పోలీసులు, బీమా కంపెనీలు, న్యాయవాదుల సహకారంతో అత్యధికంగా కేసులను రాజీ కుదురుస్తున్నామన్నారు. బేల మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన అశ్వీత్‌కు బ్యాంక్ అకౌంట్ అప్‌డేట్ కోసం వచ్చిన మెస్సేజ్‌ను క్లిక్ చేయడంతో అకౌంట్‌లో ఉన్న రూ.12 వేలు ఇతర అకౌంట్‌లోకి మారినట్లు మెస్సేజ్ వచ్చింది. దీంతో బాధితుడు రెండు నిమిషాలలో సైబర్ క్రైమ్ నంబర్1930కి ఫిర్యాదు చేయడంతో పొగొట్టుకున్న డబ్బులు పోలీసులు అప్పగించారు. న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, రాజ్యాలక్ష్మి, కుమార్ వివేక్, కుమారి లక్ష్మి, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, ఏఎస్పీ సురేందర్‌రావు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూన్ 14 : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని ప్రజలు కోర్టు కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శనివారం నిర్మల్ పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జడ్జి శ్రీవాణితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోర్టు చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చని అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. పలు క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, ఆస్తి గొడవల వంటి కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అనంతరం లోక్ అదాలత్ ద్వారా తమ విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తలను కలెక్టర్, న్యాయమూర్తి అభినందించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

భైంసా, జూన్, 14 : రాజీతోనే రాజమార్గమని భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న ప్రతి కేసులో కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మొత్తం 1720 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీపీవో అరుణ, సుమిత్ సింగ్, ప్రశాంత్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

తాంసి, జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో జామిడి శివారులోని పంట చేన్లలో 20 రోజుల క్రితం గాలివానతో విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో పంట చేన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మండలంలోని గ్రామాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు విసుగు చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూసి, పంట పొలాల్లో పడిపోయిన స్తంభాలకు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.



తాంసి: గాలివానతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

## ఐటీఐలపై అవగాహన

ఉట్నూర్, జూన్ 14: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక, ఉపాధి శిక్షణ సంస్థ(ఐటీఐ)పై హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇందులో అధికారులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాల్లో ఏటీసీలుగా మార్చి విద్యాబోధన అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించి ఈ విద్యాసంవత్సరంకు ఆగస్టు నుంచి ప్రవేశాలు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


## సమస్యలు పరిష్కరించాలి



బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్, జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నెరేడు పల్లె గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు నేరేడిగొండలోని క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఇక్కడ గ్రామస్తులతో పాటు శ్రీధర్ రెడ్డి, పంద్రం శంకర్, నరేందర్ ఉన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన జడ్పీ మాజీ చైర్మన్



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, జూన్ 14 : హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి), జూన్ 14 : నర్సాపూర్(జీ) మండలంలోని దొంగూర్గం గ్రామానికి చెందిన జంగిపల్లి నర్సయ్య(22) నిర్మల్ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి విచారణ చేపడుతున్నారు.